క్లుప్తంగా

బెంచీల వితరణ



బెంచీలు అందిస్తున్న క్లబ్ బాధ్యులతో డీఈఓ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని జిల్లా సైన్స్ మ్యూజియానికి లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం గ్రేట్ ఆధ్వర్యాన రూ.25వేల విలువైన ఐదు బెంచీలను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడుతూ.. మ్యూజియానికి బెంచీలు అందించడం అభినందనీయమని, ముందుందు కూడా సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పెసర ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి శ్యామల శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ సుంకు నాగిరెడ్డి, డీఎస్‌ఓ జగదీశ్వర్, డీసీఈబీ సెక్రటరీ నారాయణ, ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సోలార్ వెలుగుల సర్వే



సర్వే చేస్తున్న ఏఈ రామారావు

నేలకొండపల్లి: ఉచిత విద్యుత్‌ను అందించేందుకు నిర్వహిస్తున్న సోలార్ సర్వే శరవేగంగా కొనసాగుతుంది. మండలంలోని చెరువుమాధారం గ్రామం సోలార్ మోడల్ విలేజ్‌ను ఎంపిక కాగా ఆదివారం నేలకొండపల్లి విద్యుత్ ఏఈ కె.రామారావు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ప్రత్యేక బృందాల ఏర్పాటు చేసి గ్రామంలో ఉన్న 1536 గృహాలు, 696 వ్యవసాయ కనెక్షన్లకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కూసుమంచి: మండలంలోని చేగొమ్మ గ్రామంలో లయన్స్ క్లబ్, ఖమ్మం ఆధ్వర్యాన ఆదివారం శ్రీనివాస, శ్రీదేవి, శరత్ మాక్స్‌కేర్ ఆస్పత్రుల సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న పలువురికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీరాం, వైద్యులు బొల్లికొండ శ్రీదేవి, గోపగాని సురేందర్, సునీల్‌గౌడ్, ప్రశాంత్, రాజ్‌కుమార్, సుహాస్‌తో పాటు క్లబ్ బాధ్యులు విశ్వేశ్వరరావు, సుబ్బారావు, హుస్సేన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కులాంతర వివాహాలను ప్రోత్సహించాలి

ఖమ్మంమయూరిసెంటర్: బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు కులాంతర వివాహాలు కుల రహిత సమాజ స్థాపనకు బాటలు వేస్తాయని, కులాంతర వివాహాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ అన్నారు. ఆదివారం స్థానిక మంచికంటి హాల్‌లో కులాంతర వివాహితుల సంక్షేమ సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. కులాంతర వివాహితుల ప్రత్యేక రక్షణకు తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయాలన్నారు. అనంతరం కులాంతర వివాహం చేసుకున్న దంపతులను అభినందించి, సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు మాచర్ల భారతి, వైద్యులు ఎంఎఫ్ గోపీనాథ్, బి.వి.రాఘవులు, బొంతు రాంబాబు, ముత్తమాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	16	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	44	పాలకూర	3
పచ్చిమిర్చి	34		20
కాకర	44	చుక్కకూర	3
బోడ కాకర	120		20
బీర	48	తోటకూర	3
దొండ	28		20
పొట్లకాయ	50	గోంగూర	4
చిక్కుడు	38		20
గోరుచిక్కుడు	44	మెంతికూర	2
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		40
చామగడ్డ	44	పుదీన	1
క్యారెట్	24		25
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

సమస్యలు ఏకరువు..

కేఎంసీలో రెవెన్యూ విభాగానికి ఫిర్యాదులు వెల్లువ

- సమస్యలకు పరిష్కారం చూపని అధికారులు
- ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు
- ఫిర్యాదుదారుల ప్రదక్షిణలను పట్టించుకోని యంత్రాంగం



ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆస్తి పన్నుల వసూళ్లపై దృష్టి సారించిన విధంగా ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేఎంసీలో ప్రధానంగా రెవెన్యూ విభాగానికి సంబంధించి సమస్యలను పరిష్కరించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. కేఎంసీ కార్యాలయంలో సగానికి పైగా ఫిర్యాదులు ఆ విభాగానికే వస్తుండడం గమనార్హం. అయితే ఈ సమస్యల పరిష్కారం కోసం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మూడు దఫాలుగా రెవెన్యూ మేళాలు ఏర్పాటు చేయించారు. అయినా ప్రజల నుంచి ఫిర్యాదులు తగ్గకపోగా.. ఒకే ఫిర్యాదుతో పదేపదే కార్యాలయం చుట్టు తిరిగే వారి సంఖ్య పెరుగుతోంది. దీనిని బట్టి కేఎంసీలో రెవెన్యూ విభాగం పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫిర్యాదుల వెల్లువ..

రెవెన్యూ విభాగ సమస్యల పరిష్కారం కోసం కేఎంసీ కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ఈ విభాగానికి సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తుండడం గమనార్హం. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగరంలోని 15వ డివిజన్ అల్లీపురంలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న సమయాన స్థానికులంతా రెవెన్యూ విభాగం సమస్యలపై ఏకరువు పెట్టుకున్నారు. ఇంటి నంబర్లు ఇవ్వడం లేదని, పేర్లు సరిచేయడంలేదని, కార్యాలయం చుట్టూ తిరిగినా పని కావడం లేదని మొర పెట్టుకోవడంతో మంత్రి ఆదేశాల మేరకు అధికారులు ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ మేళా నిర్వహించారు. ఆ మేళాలో వచ్చిన దరఖాస్తుల్లో సగం కూడా పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు.

> నగరంలోని చెరువుబజార్‌లో ఓ వ్యక్తి ఇల్లు నిర్మించుకుని 2018 నుంచి నివాసం ఉంటున్నారు. అయితే మున్సిపల్ అధికారులు ఆ ఇంటికి 5–7–182/1/ఆ/17 నంబర్ కేటాయించి 1106064809 అసెస్‌మెంట్ నంబర్‌తో పన్ను వసూలు చేస్తున్నారు. ప్రతీ ఆరు మాసాలకోసారి అతడు ఇంటి పన్ను చెల్లిస్తుండగా.. ఇటీవల సదరు యజమానికి మరో తొమ్మిది అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించి పన్నులు చెల్లించాలని కేఎంసీ సిబ్బంది ఫోన్ చేస్తుండడంతో అవాక్కయ్యాడు. పన్ను చెల్లించినా ఇంకా బకాయి ఉండడమేంటని పరిశీలించగా.. వేరువేరు అసెస్‌మెంట్ నంబర్లతో పన్నులు చెల్లించాలని మెస్సేజ్‌లు పంపించడం గమనించారు. దీనిపై అధికారులను కలిసి పలుమార్లు విన్నవించుకున్నా.. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ నెల 10న మరోసారి వినతి అందించారు.

ప్రతీ సోమవారం కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్ కాక రెండు సార్లు నిర్వహించిన రెవెన్యూ మేళాలో సుమారు 200 వరకు ఫిర్యాదులు అందాయి. ఇందులో ఎన్ని సమస్యలకు పరిష్కారం చేశారో అధికారులకు తెలియని పరిస్థితి ఉంది.

పన్నులపై ప్రభావం..

రెవెన్యూ విభాగంలో తమ సమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు పన్నులు చెల్లించేందుకు వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. సమస్యను పరిష్కరించిన తర్వాతే పన్ను చెల్లిస్తామని ఫిర్యాదుదారులు అధికారులకే నేరుగా తెలుపుతున్నట్లు తెలిసింది. అధిక పన్ను వస్తుందని అధికారులకు అర్జీ పెట్టుకున్న యజమానులు ఇప్పటివరకు సమస్యను పరిష్కరించుకుండా పన్ను కట్టాలని ఎలా అడుగుతున్నారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ విభాగ సమస్యలు పరిష్కరించకపోవడంతో పన్నుల చెల్లింపుపై ప్రభావం పడుతుందని అధికారులే చెబుతుండడం గమనార్హం.

దీనిపై రెవెన్యూ విభాగ అధికారులను వివరణ కోరగా.. ఇప్పటి వరకు అందిన ఫిర్యాదుల్లో కొన్నింటిని పరిష్కరించామని, త్వరలోనే అన్నింటినీ పరిశీలించి పరిష్కారమార్గం చూపుతామని తెలిపారు.

మంత్రి పొంగులేటికి వినతులు



మాజీ సర్పంచ్ నారాయణ యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి: మండలంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అనాసాగారంలో అన్నప్రాసన వేడుకలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించాక వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు గ్రామంలో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్లు తదితర వాటిని నిర్మించాలని వినతిపత్రం అందించారు. అంతేకాక వివిధ సమస్యలపై పలువురు మంత్రికి వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, శాఖమూరి రమేష్, భద్రయ్య, వంగవీటి నాగేశ్వరరావు, బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, వేగినాటి లక్ష్మీనర్సయ్య, ఎం.నర్సయ్య, ఇస్లావత్ బాలాజీ పాల్గొన్నారు.

అన్నదానం, పూజలు



కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

- ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న శ్రీ షిర్డీ సాయిబాబా మందిరం 14వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథున్ని పూలు, కిరీటం, పట్టు వస్త్రాలతో అలంకరించి మాదిరి హారతుల కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్, విజయనగరంలకు చెందిన సాయిలక్ష్మి, శ్రీధర్‌లు సాయి బాబా కీర్తనలు పాడగా, బాబా విష్ణు, సాయి భజన మండలి సభ్యులచే విష్ణు సహస్రనామం, భజన కార్యక్రమాలు జరిపారు. అనంతరం భక్తులు, పేదలకు అన్నదానం చేశారు. మందిర కమిటీ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.
- ఖమ్మం సహకారనగర్: తెలంగాణ నారాయణ విద్యాసంస్థల జీఎం గోపాల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం నగరంలోని షిరిడీ సాయి సిటిజెన్స్ ఆశ్రమం, మెఫీ అనాథ శరణాలయంలో అన్నదానం నిర్వహించినట్లు ఏజీఎం రామ్, ఆర్ఐ క్రాంతిలు తెలిపారు.

చికెన్ వ్యర్థాలతో అనర్థాలు..

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురం గ్రామ ప్రవేశం వద్ద ఉన్న చికెన్ షాపుల వ్యర్థాలతో అనారోగ్యపాలవుతున్నామని గ్రామానికి చెందిన కె.రవీందర్‌రెడ్డి, కె.వెంకటేశ్వర్లు, ఎ.ఉపేందర్ ఆరోపించారు. దుకాణాల నుంచి వచ్చే వ్యర్థాలను ఎన్నెస్పీ కాల్వలో పడేస్తుండడడంతో సమీప ఇళ్లల్లోకి భరించలేని దుర్గంధం వస్తుందన్నారు. గతంలో ప్రధాన రహదారి పక్కన షాపులు నిర్మించగా రోడ్డు వెడల్పులో భాగంగా అధికారులు వాటిని తొలగించారని, ఇప్పుడు ఎన్నెస్పీ కాల్వ సమీపంలోని పంట పొలాల్లో చికెన్ వ్యర్థాలను వేస్తున్నారన్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బిక్కు

ఖమ్మం సహకారనగర్: నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.బిక్కు పేర్కొన్నారు. ఆదివారం ఇందిరానగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగుల క్రీడలు, అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు, సీపీఎస్ రద్దు, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని తీర్మానించామన్నారు. సంఘం హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోడి లింగయ్య, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు వెంకటమణ, వెంకన్న, వెంకటేశ్వరరావు, అంజమ్మ, సీతారాములు, రాంప్రసాద్, చావా నారాయణరావు పాల్గొన్నారు.

డివైడర్ల తొలగింపు అభివృద్ధి కాదు



డివైడర్ల తొలగింపును పరిశీలిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: మయూరిసెంటర్ నుంచి రాపర్తినగర్ వరకు బస్ డిపో రోడ్డును వెడల్పు చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ డిమాండ్ చేశారు. ఆదివారం బస్‌డిపో రోడ్డులో డివైడర్ల తొలగింపును పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. డివైడర్లను తొలగిస్తే సమస్య పరిష్కారం కాదని, 100 అడుగుల రోడ్‌గా విస్తరణ చేస్తేనే అభివృద్ధి చెందినట్లు అవుతుందన్నారు. గత ప్రభుత్వం నిధులు కేటాయించి కూడా రోడ్డు వెడల్పు చేయకుండా డివైడర్లు నిర్మించి చేతులు దులుపుకుందని, ఈ ప్రభుత్వం అయినా దీనిపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, జిల్లా కమిటీ సభ్యులు టి.విష్ణువర్ధన్, భుక్యా ఉపేంద్ర, జె.వెంకన్నబాబు, హుస్సేన్, నాగేశ్వరరావు, రాజేష్, మల్లికార్జున్‌రెడ్డి, గుమ్మడి భిక్షం, వినోద్, షఫీ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 11 కేవీ మైసమ్మ గుడి విద్యుత్ ఫీడర్ లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు (సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మమత రోడ్డు విద్యుత్ సెక్షన్ ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వీఆర్‌కే సిల్క్స్ వెనక వీధి, వరదయ్యనగర్, ఈఆర్ఆర్ రీస్టార్స్, మమత ఆస్పత్రి రోడ్డు ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మధురానగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 4 వరకు, రాఘవయ్యనగర్‌లతో పాటు మధురానగర్ ఫీడర్ పరిధిలో అంతరాయం ఉంటుందన్నారు.. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఖురాన్ బోధనలు మార్గదర్శకం

ఖమ్మం మామిళ్లగూడెం: దివ్య ఖురాన్ బోధనలు మానవాళికి మార్గదర్శకమని జమాతె ఇస్లామీ హింద్ కేంద్ర డైరెక్టర్, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జనాబ్ హమెద్ మొహమ్మద్ ఖాన్ తెలిపారు. జమాతె ఇస్లామ్ హింద్ ఖిల్లా శాఖ ఆధ్వర్యాన రంజాన్ నెల స్వాగత సభ ఆదివారం ఖమ్మం అజీజ్ గల్లీ సంఘ కార్యాలయంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎండీ ఇలియాస్, జిల్లా మాజీ అధ్యక్షుడు అబ్దుల్ ముజీబ్, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ సమి, ఖిల్లా అధ్యక్షులు అబ్దుల్ మలిక్, నిజాముద్దీన్, అబ్దుల్ సుబూర్, ఖలీల్ అహ్మద్‌ఖాన్, గౌస్, జమీల్ అహ్మద్‌ఖాన్, నిహాల్ అహ్మద్, యుసూఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్



ఖమ్మంఅర్బన్: వేడుకలో పాల్గొన్న సంక్షేమ సంఘం బాధ్యులు

కామేపల్లి/ఖమ్మంఅర్బన్: గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కామేపల్లిలో లంబాడా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు భూక్యా నాగేంద్రబాబు ఆధ్వర్యాన, ఖమ్మంలో తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యాన స్థానిక బంజారా భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కామేపల్లిలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ఖమ్మంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బాదావత్ శ్రీను పాల్గొన్ని మాట్లాడుతూ.. సేవాలాల్ మహారాజ్‌ను ఆదర్శంగా తీసుకుని,ప్రతి ఒక్కరూ ఆయన మార్గంలో నడవాలన్నారు. అనంతరం భోగ్ బండోరా నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వీరన్న, ఉపాధ్యక్షులు రమేష్, ప్రచార కార్యదర్శి భూక్య శ్రీనులతో పాటు నాగరాజు, నరసింహ, భీముడు, హట్యా, భాస్కర్, కిషన్, నెహ్రూ, జగ్గీలాల్, మంగ్యా, శోభ, వీరభద్రం, భిక్ష, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి..

తిరుమలాయపాలెం: కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు గుగులోత్ సురేష్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఆయా గిరిజన తండాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేష్, రవి, వినోద, భద్రు, రమేష్, బాలు, వీరన్న తదితరులు ఉన్నారు.

పండితాపురంలో ఘనంగా బోనాలు



పూజలో పాల్గొన్న యాదవ సంఘం నాయకులు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామ శివారులోని లింగమంతులస్వామి ఆలయం వద్ద యాదవులు ఆదివారం బోనాల వేడుక ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు చెల్లించారు. ఈ వేడుకల్లో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, చిలకల వెంకటనర్సయ్య, చిత్తారు సింహాద్రి పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు.

త్యాగాల చరిత్ర కమ్యూనిస్టులదే..



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాగం హేమంతరావు

కూసుమంచి: త్యాగాల చరిత్ర కమ్యూనిస్ట్ పార్టీలదేనని, భూమి, సూర్యుడు ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారం మండలంలోని లాల్‌సింగ్‌తండాలో నిర్వహించిన గ్రామ శాఖ మహాసభలో అయన పాల్గొని మాట్లాడారు. సమసమాజ స్థాపన కోసం కమ్యూనిస్టులు తమ జీవితాలను అంకితం చేశారని, వారిని ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా మాట్లాడుతూ.. తాము కాంగ్రెస్‌తో కలిసి వెళుతున్నా.. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి పలువురు సీపీఐలో చేరగా వారికి హేమంతరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తినాయక్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు గుండెపొంగు మల్లేష్, మండల కార్యదర్శి భూక్యా నర్సింహ, నాయకులు జల్లా లింగయ్య, కత్రోజు పాండురంగాచారి, సంగబత్తుల ఉపేందర్‌రెడ్డి, తేలు పిచ్చయ్య, ప్రసాద్, రవీందర్, సురేష్, పీర్యా తదితరులు పాల్గొన్నారు.

సుబాబుల్, జామాయిల్ ధరను స్థిరీకరించండి

ఖమ్మంమయూరిసెంటర్: సుబాబుల్, జామాయిల్ ధరలను స్థిరీకరించాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో అఖిలపక్ష రైతు సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రైతుల వద్ద నుంచి సుబాబుల్, జామాయిల్ కొనుగోలు విషయంలో సిండికేట్‌గా మారి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వద్ద నుంచి టన్ను రూ.17వేలకు కొనుగోలు చేస్తున్నారని, ఇతర దేశాలనుంచి రూ.18వేలకు దిగుమతి చేసుకుంటున్నారని కాని రైతుల వద్ద నుంచి కేవలం రూ.10,500లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. ఇప్పుడు ఇంకో రూ.300 తగ్గించి కంపెనీలు సిండికేట్‌గా మారి దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు బాగం హేమంతరావు, దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, అడపా రామకోటయ్య, సామినేని హరిప్రసాద్, మలీదు నాగేశ్వరావు, చావా కిరణ్, వేములపల్లి సుధీర్, వట్టికొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 19న మరోసారి సమావేశమై కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించినట్లు వారు తెలిపారు.

క్రికెట్ పోటీల్లో ‘ఖమ్మం అర్బన్’ గెలుపు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న 17వ రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ పోటీల్లో ఖమ్మం అర్బన్ జట్టు గెలుపొందింది. ఆదివారం ఖమ్మం అర్బన్–భద్రాద్రి కొత్తగూడెం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఖమ్మం అర్బన్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 145 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భద్రాద్రి కొత్తగూడెం జట్టు పరిమిత ఓవర్లలో 109 పరుగులు చేసి ఓటమి పాలైంది. కాగా, గెలుపొందిన జట్టులో రామకృష్ణ 38 బంతుల్లో 65 పరుగులు సాధించగా, సంపత్ 3 వికెట్లు, సవీన్, వీరేష్‌లు రెండు వికెట్ల చొప్పున పడగొట్టిజట్టును విజయపథంలో నడిపించారు. రెండో మ్యాచ్‌లో ఖమ్మం రూరల్‌పై కల్లూరు జట్టు విజయం సాధించగా, మణుగూరు జట్టు రఘునాథపాలెం జట్టుపై గెలుపొందింది. తొలుత ఈ పోటీలను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ ప్రారంభించగా.. టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతీన్, సాయి నిరంజన్, ఫరీద్ ఖాద్రి, అంజలి, నాగేశ్వరావు, మారుతి శ్రీను, ఇమ్రాన్, సిద్ధు, మహేష్‌లు పాల్గొన్నారు.

మున్నూరుకాపు కులగణన రీ సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల గాంధీ

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరుకాపు కులగణన రీ సర్వే చేసి, దామాషా ప్రకారం తమ వాటాను తేల్చాలని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ డిమాండ్ చేశారు.ఈమేరకు ఆదివారం నగరంలోని జమ్మిబండ సెంటర్‌లో గల సంఘం హాస్టల్ ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు పార నాగేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనాభాను తక్కువ చేసి చూపడం వల్ల తమకు సంక్షేమ ఫలాలు దూరమవుతాయని, తక్షణమే తప్పుడు లెక్కను సరిచేయాలని డిమాండ్ చేశారు. నేడు(సోమవారం) కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్న నేపథ్యాన మున్నూరుకాపు కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పసుపులేటి దేవేందర్, ట్రస్ట్ బోర్డ్ అధ్యక్ష, కార్యదర్శులు మేకల భిక్షమయ్య, కనిసెట్టి నర్సయ్య, గౌరవ సలహాదారులు మెంతుల శ్రీశైలం, టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు మడూరి పూర్ణచందర్‌రావు, ఉప్పల్‌రావు, శీలంశెట్టి వీరభద్రం, వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు తోట వీరభద్రం, మాటేటి నాగేశ్వరరావులతో పాటు గుండపునేని నరసింహారావు, కేదాసు నర్సయ్య, పసుపులేటి వెంకటి, మేకల నాగేందర్, పులిరాజు వెంకటేశ్వర్లు, శెట్టి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడండి



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, పరువు హత్యలు జరుగుతున్నాయని ఇది పూర్తిగా పాలకుల వైఫల్యమేనని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి అన్నారు. ఆదివారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయినా మహిళలపై అఘాయిత్యాలు ఆగడం లేదని, ఏదైనా ఘటన జరిగినప్పుడు సరైన చట్టాలతో నిందితులను శిక్షించేలా కఠినమైన చట్టాలు తీసుకొచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో మార్చి 1 నుంచి 8 వరకు మహిళలపై జరుగుతున్న దాడులు, పరువు హత్యలకు వ్యతిరేకంగా సభలు, ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, డి.రూనీస్, శోభ, స్వాతి, పూలమ్మ, లలిత, పరిమళ, వసుమతి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

చేపలు.. మృత్యువాత!



అనాసాగారం చెరువులో చనిపోయిన చేపలు

మండలంలోని అనాసాగారం గ్రామంలోని చెరువులో చేపలు మృత్యువాత పడుతున్నాయి. దాదాపు 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువును వేలం పాట ద్వారా గ్రామానికి చెందిన యువత దక్కించుకోగా.. గత రెండు రోజుల నుంచి ఎండ తీవ్రతకు అవి చనిపోతుండడంతో సభ్యులు ఆందోళన చెందుతున్నారు. చేపలు పెద్ద సైజుకు వస్తున్న సమయాన చనిపోతున్నాయని వాపోతున్నారు. వీటి సంరక్షణపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. – నేలకొండపల్లి